


# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక


సంపుటి-1, సంచిక-2, 02-08-2026, ఎడిటర్ : రాథోడ్ రాజు పేజీలు-4, వెల రూ.4/-

Warangal, Ranga Reddy, Khammam, Nizamabad, Karimnagar, Hyderabad, Mahabubnagar, Visakhapatnam, Kadapa, Vijayawada, Tirupati, Guntur, Kurnool, Nellore, Srikakulam


## తెలంగాణ రైజింగ్.. కొత్త శిఖరాలకు రాష్ట్రం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 1: తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం సంబంధిత స్క్రీన్ షాట్‌ను ఎక్స్‌లో షేర్ చేశారాయన. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు...

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం.. బిల్లులోని కీలక



2

## మళ్లీ ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర..

## బల్తాల్ మార్గం నుంచి మాత్రమే అనుమతి



అమర్‌నాథ్ యాత్ర శనివారం తిరిగి ప్రారంభమైంది. వాతావరణం అనుకూలించడంతో బల్తాల్ మార్గంలో యాత్రను తిరిగి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. గత నెలలో ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. అయితే, భారీ వర్షాలు, రోడ్లు దెబ్బతినడం, వాతావరణం అనుకూలంగా లేకపోవడం వంటి కారణాల వల్ల యాత్రను శుక్రవారం తాత్కాలికంగా నిలిపివేశారు. కానీ, శనివారం వర్షాలు తగ్గడం, వాతావరణం అనుకూలంగా ఉండటంతో యాత్రను తిరిగి ప్రారంభించారు.ఇదే సమయంలో రోడ్లకు కూడా మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం బల్తాల్ మార్గంలో అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందని, భక్తులను పవిత్ర మంచులింగాన్ని దర్శించుకునేందుకు అనుమతిస్తున్నామని అధికారులు వెల్లడించారు. అయితే, పహల్గాం మార్గం నుంచి సాగే యాత్రను అధికారులు ఇంకా నిలిపివేశారు. ఈ మార్గంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడం, రోడ్ల మరమ్మతు పనులు సాగుతుండటంతో ప్రస్తుతానికి యాత్రను నిలిపివేసినట్లు తెలిపారు. ఇదే సమయంలో అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం వల్ల జమ్మూ-శ్రీనగర్ హైవేను అధికారులు మూసివేశారు. ఇది 250 కిలోమీటర్ల దూరం కలిగిన జాతీయ రహదారి. కాశ్మీర్‌ను, దేశమంతా కలిపి ఉంచే రహదారి ఇదే.రోడ్డు మార్గం దెబ్బతినడంతో భాగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి వెళ్లాల్సిన భక్తుల్ని కూడా అనుమతించడం లేదు. ఇంకా అక్కడి అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. గత నెల 3న ఈ యాత్ర ప్రారంభమైంది. ఇప్పటివరకు 4,50,000 మంది భక్తులు పవిత్ర గుహలోని మంచులింగాన్ని దర్శించుకున్నారు. ప్రతి ఏడాదికోసారి సాగే అమర్‌నాథ్ యాత్ర ఈ నెల చివరి వరకు కొనసాగనుంది

## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం..

## ఫాస్ట్‌ట్రాక్ విచారణ: మంత్రి పొంగులేటి


హైదరాబాద్, ఆగస్టు 01: గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ వేదికగా జరిగిన భూ అక్రమాలపై ప్రభుత్వం తీవ్రస్థాయిలో దృష్టి సారించిందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే ఫాస్ట్‌ట్రాక్ విచారణ ద్వారా బాధ్యులపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. ధరణి నుంచి నేటి 'భూభారతి' వరకు జరిగిన ప్రతి లావాదేవీపై సమగ్ర విచారణ జరుపుతామని, పేదల భూములను కాజేసిన ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

ప్రభుత్వం కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితా (లో చేర్చలేదని, గతంలో పెట్టిన జాబితాపై సమగ్ర పరిశీలన జరుగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 276 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని వెల్లడించారు. ఇకపై ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేకమైన 'భూధార్' సంఖ్యను కేటాయించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ఒక స్పష్టమైన, సమగ్రమైన విధానాన్ని ప్రవేశపెడతామని, ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు.కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినప్పటికీ 'ఇందిరమ్మ ఇళ్ల' బిల్లుల చెల్లింపులు ఆపేది లేదని, లబ్ధిదారులకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భూముల ధరల సవరణ వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం 10 నుంచి 20 శాతం వరకు పెరిగిందని, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం దాదాపు రూ.18,000 కోట్లకు చేరే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు.



## ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా ..

## అరవింద్ కేజ్రీవాల్ నిరసన..





### ఈ నెల 4న ఢిల్లీలో ప్రధాని ఇంటికి మార్చ్

ఢిల్లీ ,(రిపబ్లిక్ హిందుస్థాన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా భారీ ఆందోళనకు ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సిద్ధమవుతున్నారు. ఆగస్టు 4న ప్రధాని మోదీ నివాసం వరకు మార్చ్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు లక్షల మంది సంతకాలతో కూడిన పిటిషన్‌ను అందజేస్తామని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా చేపట్టబోయే ఉద్యమం గురించి

## మీ సేవలో చరిత్రాత్మక రికార్డు..

## ఒక్కరోజులో 2.20 లక్షల లావాదేవీలు: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 1: తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పాలనకు ప్రతీకగా నిలిచిన మీసేవ సేవలు మరో అరుదైన ఘనతను సాధించాయి. గతంలో రోజుకు సగటున 70 నుంచి 80 వేల వరకు మాత్రమే నమోదయ్యే లావాదేవీలు, తాజాగా ఒక్కరోజులోనే 2.20 లక్షలకు చేరుకోవడం విశేషమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మీసేవ చరిత్రలో తొలిసారిగా రెండు లక్షల మార్క్‌ను అధిగమించడం రాష్ట్ర ఈ-గవర్నెన్స్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ కార్డు దరఖాస్తులకు అత్యధిక స్పందన లభించగా, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం కూడా భారీ సంఖ్యలో ప్రజలు మీసేవను ఆశ్రయించినట్లు వెల్లడించారు. ప్రజలకు సులభంగా, వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడం వల్లే ఈ స్థాయి ఆదరణ లభించిందని మంత్రి అభిప్రాయపడ్డారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా లక్షలాది లావాదేవీలను విజయవంతంగా నిర్వహించిన మీసేవ బృందాలు, సాంకేతిక నిపుణులు, సంబంధిత శాఖల అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా భవిష్యత్తులో మరిన్ని పౌర సేవలను మీసేవ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించి సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి



ఉందన్నారు. ప్రతి పౌరుడు ప్రభుత్వ సేవలను కార్యాలయాల చుట్టూ తిరగకుండా డిజిటల్ విధానంలో సులభంగా పొందేలా మీసేవను మరింత విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

## అజిత్ దోవల...లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు..

**పుణె:** జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్(నాయిత్ ఐశీఘ్రుశ్రీ)కు .. ఇవాళ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును అందజేశారు. పుణెలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా అవార్డును అందజేశారు. లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్ మాట్లాడుతూ.. దేశ భద్రతకు, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్స్‌కు, బోర్డర్ సెక్యూర్టీకి పాల్పడుతున్న అజిత్ దోవల్‌కు అందజేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డులో భాగంగా ఓ మెమొంటో, ప్రశంసా పత్రం, లక్ష క్యాష్ ప్రైజ్ ఇస్తారు.తమకు చెందిన రంగాల్లో దేశాన్ని అత్యున్నత స్థాయిలో నిలిపిన వారికి ప్రతి ఏడాది ఈ అవార్డును అందజేస్తారు. దేశ ప్రయోజనాల రక్షణ కోసం సేవ చేసిన అజిత్ దోవల్‌ను ఈ ఏడాది అవార్డు కోసం ఎంపిక చేశారు. ఇంటెలిజెన్స్, నేషనల్ సెక్యూర్టీ అంశంలో అజిత్ దోవల్ సుదీర్ఘ కెరీర్ ఉన్నది. ఆపరేషన్ బ్లాక్ థండర్, డోక్లామ్ దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల్లో అజిత్ దోవల్ పాత్ర కీలకమైంది. 1968 నాటి కేరళ కేడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ ఆయన. మూడు దశాబ్దాల పాటు భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా ఉన్నారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ లాంటి సున్నిత ప్రదేశాల్లో ఆయన పనిచేశారు. దీంతో పాటు ఇస్లామాబాద్, లండన్ పట్టణాల్లోనూ చేశారు. ప్రస్తుతం దోవల్ వయసు 81 ఏళ్లు. నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా సుదీర్ఘ కెరీర్‌లో కొనసాగుతున్నారు.

## పాక్ యుద్ధాన్ని ఆపింది నేనే.. ట్రంప్ నోట అదే మాట..

ఇంటర్నెట్ డెస్క్: భారత్ పాక్ యుద్ధాన్ని తాను ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పుకున్నారు. సుంకాలతో బెదిరించి యుద్ధాన్ని ఆపేలా చేశానని చెప్పారు. తాజా పత్రికా సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తొలుత రష్యా ఉక్రెయిన్ యుద్ధం గురించి ట్రంప్ ప్రస్తావించారు. యుద్ధం ముగించేలా డీల్ కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికే తాను అనేక యుద్ధాలను ఆపానని చెప్పారు. అనంతరం భారత్–పాక్ యుద్ధం గురించి ప్రస్తావించారు. ‘భారత్–పాక్ యుద్ధానికి మేమే ఫుల్ స్టాప్ పెట్టాము. ఆ సమయంలో 11 యుద్ధ విమానాలు కూలిపోయాయి. యుద్ధం భీకరంగా ఉంది. వెంటనే నేను సుంకాల అంశాన్ని తెరపైకి తెచ్చా.. మీరు యుద్ధం చేస్తే 250 శాతం సుంకం విధిస్తానని అన్నాను. దీంతో, వాళ్లు గోల గోల చేశారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుసటి రోజు మళ్లీ నాకు ఫోన్ చేసి యుద్ధం చేయమని చెప్పారు’ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. యుద్ధం అడ్డుకుని 50 మిలియన్ల మంది ప్రాణాలు కాపాడారని పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ తనను ప్రశంసించారని ట్రంప్ చెప్పుకొచ్చారు.ట్రంప్ గతంలో కూడా ఇలాంటి ప్రకటనలే చేశారు. అనేక సందర్భాల్లో భారత్ ఈ వాదనలను తోసిపుచ్చింది. పాక్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ద్వైపాక్షిక అంశమని తేల్చి చెప్పింది. మరో దేశం జోక్యం లేనేలేదని స్పష్టం చేసింది. పలు ఫైటర్ జెట్స్ కూలిపోయాయన్న ట్రంప్ ప్రకటనను కూడా భారత్ గతంలోనే తోసిపుచ్చింది.

## ఆపరేషన్ ముస్కాన్ - విజయవంతం..
## 664 మంది చిన్నారుల సేఫ్...

**హైదరాబాద్, ఆగస్టు 1:** సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన ‘ఆపరేషన్ ముస్కాంవిజయవంతంగా ముగిసింది. జులై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోలీసులు.. మొత్తం 664 మంది చిన్నారులను రక్షించారు. వీరిలో 644 మంది బాలురు, 20 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ ముస్కాన్లో భాగంగా తెలంగాణకు చెందిన 162 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన 502 మంది చిన్నారులను గుర్తించారు.ఆపరేషన్‌లో భాగంగా సైబరాబాద్ పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమలు, కంపెనీలు, దుకాణాలు, హోటళ్లు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలను, ర్యాగ్ పికింగ్‌తో, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించారు. రక్షించిన చిన్నారుల వివరాలను దర్పణ్ యాప్‌లో పోలీసులు నమోదు చేశారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చే లక్ష్యంతో పోలీసులు ఆపరేషన్ ముస్కాన్ చేపట్టారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చిన్నారుల భద్రతే లక్ష్యంగా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు.

## శభాష్! బాగా పనిచేస్తున్నావ్..
## మంత్రి లోకేశ్‌పై ప్రధాని ప్రశంసలు

**విజయనగరం, ఆగస్టు 1:** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ.. ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధానికి వీడ్కోలు పలికేందుకు వచ్చిన లోకేశ్ భుజం తట్టి.. ‘నువ్వు చాలా బాగా పనిచేస్తున్నావు.. శభాష్ లోకేశ్’ అని ప్రశంసించారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంపై కూడా ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు.నారా లోకేశ్ పనితీరును ప్రధాని మోదీ మెచ్చుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాని పాల్గొన్న పలు ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించిన సందర్భాల్లోనూ మోదీ ఇదే తరహాలో ఆయనను అభినందించారు. ముఖ్యంగా ‘యోగాంధ్ర’ కార్యక్రమం ద్వారా ప్రపంచ రికార్డు స్థాయిలో యోగా నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. తాజాగా భోగాపురం పర్యటన సందర్భంగా మరోసారి లోకేశ్‌ను ఆప్యాయంగా అభినందించడం

# ఉత్తరాంధ్ర.. ఇకపై ఉత్తమాంధ్ర!

- భోగాపురం విమానాశ్రయంతో కొత్త దిశ–దశ: సీఎం
- ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు అందించిన ఘనత కూటమిదే
- ఎర్ర బస్సే రాదన్న చోట ఎయిర్‌బస్ వచ్చేలా చేశాం
- అవహేళన చేసినవారు అడ్రస్ లేకుండా పోయారు
- నాడు కొబ్బరికాయ కొట్టాం.. నేడు గుమ్మడికాయ కట్టాం
- రాష్ట్ర పునర్నిర్మాణానికి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం
- ఉత్తరాంధ్రలో 8 ప్రాధాన్య సాగు ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- రెండేళ్లలో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులు
- వీటితో 5.57 లక్షల ఉద్యోగాలు.. ఉత్తరాంధ్రకే వలసొచ్చే రోజులొచ్చాయ్: సీఎం

భోగాపురం,(రిపబ్లిక్ హిందుస్థాన్): ఉత్తరాంధ్ర ఇకపై అభివృద్ధిలో ఉత్తమాంధ్రగా నిలువబోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఈ ప్రాంతం దశ–దిశ మారబోతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. ‘ఎర్రబస్సే రాదన్నారు.. ఏకంగా ఎయిర్‌బస్సే వచ్చింది. అవహేళన చేసినవాళ్లు.. అభివృద్ధిని అడ్డుకున్న వాళ్లు అడ్రస్ లేకుండా పోయారు’ అన్నారు. శనివారం భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో సీఎం మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

భూములిచ్చిన రైతులకు పాదాభివందనం..

భోగాపురం విమానాశ్రయం కోసం భూములిచ్చిన రైతులే ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు. వారందరికీ పాదాభివందనం చేస్తున్నా. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశాం. నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ విధ్వంస రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తూ మాట నిలబెట్టుకుంటున్నాం. ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకే గర్వకారణంగా నిలవనుంది. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరును విమానాశ్రయానికి పెట్టడం సముచితం. ఆయన పేరు తలుచుకుంటేనే గుండె ఉప్పొంగుతుంది. ఉత్తరాంధ్రవాసి గ్రంధి మల్లికార్జునరావు (జీఎంఆర్) ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రాజెక్టుకు తొలి అడుగు వేసిన అశోక్ గజపతిరాజు ఇక్కడి వారే. నిర్మాణం పూర్తి చేసే బాధ్యత తీసుకున్న రామ్మోహన్‌నాయుడు కూడా ఇక్కడివారే. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర సత్తాను ప్రపంచానికి చాటనుంది. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మిస్తున్నాం. శంషాబాద్ విమానాశ్రయం తెలంగాణ రూపురేఖలు మార్చినట్లే భోగాపురం... ఉత్తరాంధ్ర దశను మార్చనుంది.

ఉత్తరాంధ్రకే వలసలొచ్చే రోజులొచ్చాయ్..

కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన వ్యక్తి ప్రధాని మోదీ. పోలవరం, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కును కాపాడిన వ్యక్తి మోదీ. రాజధానికి నిధులు ఇచ్చి పనులు పునఃప్రారంభించి, అండగా నిలబడిన వ్యక్తి మోదీ. ఆయన సహకారంతో రెండేళ్లలో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించాం. వీటి ద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, స్టీల్ కంపెనీలతోపాటు చాలా కంపెనీలు వచ్చాయి. రానున్న మూడేళ్లలో రూ.2784 కోట్లతో ఈ ప్రాంతంలో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. 65 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేరడి బ్యారేజీకి అనుమతులు వచ్చాయి. దానికి నిధులు కేటాయించాం. ఈ నెలలో గోదావరి నీటిని అనకాపల్లికి తీసుకొస్తాం. వంశధార–గోదావరి నదుల అనుసంధానం చేస్తాం. ఉత్తరాంధ్రలో టూరిజం, ఫార్మా, జాతీయ రహదారులు, రేర్ ఎర్త్ మినరల్స్, పుణ్యక్షేత్రాలు వంటివి పుష్కలంగా ఉన్నాయి. ఉపాధి కోసం ఉత్తరాంధ్ర నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి తగ్గుతుంది. భవిష్యత్‌లో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికే వలస వచ్చే రోజులు వస్తాయి.

మోదీలాంటి నేతను చూడలేదు...

ప్రపంచం ఐటీ నుంచి ఏఐ వైపు వెళ్తోంది. ఈ దశలో వివిధ దేశాలు సరైన నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నాయి. కానీ భారతదేశం అదృష్టం. ప్రధాని మోదీ వంటి సమర్థ నాయకుడు లభించారు. 144 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలిగేది ఒక్క మోదీనే. ప్రధానిగా 12 ఏళ్లుగా దేశాన్ని సమర్థంగా నడిపిస్తున్నారు. పరిపాలనలో అవినీతి ఆరోపణలు లేకుండా ముందుకెళ్తున్నారు. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నారు. ఈ దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చిన ఘనత మోదీకి దక్కుతుంది. సోలార్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ప్రోత్సహించి వాటి ద్వారా కాలుష్యం తగ్గిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే నాలుగో స్థానంలోకి తెచ్చారు. తీవ్రవాదం, నక్సలిజం లేకుండా అరికట్టారు. మోదీ సారథ్యంలో 2047లోగా ప్రపంచంలో భారత్ నంబర్‌వన్‌గా నిలుస్తుంది. రైట్ టైమ్.. రైట్ ప్లేస్‌లో రైట్ మ్యాన్‌గా మోదీ ఉన్నారు. ఆయనకు అందరూ అండగా నిలవాలి. అది మన బాధ్యత.


ప్రధాని చేతుల మీదుగానే పోలవరం, అమరావతి

ప్రధాని మోదీ నాయకత్వంలో 2015లో భోగాపురం విమానాశ్రయాన్ని ప్రకటించాం. అనుమతులు తెచ్చి, 2019లో శంకుస్థాపన చేశాం. నాడు కొబ్బరికాయ కొట్టింది మనమే. నేడు గుమ్మడి కాయ కట్టిందీ మనమే. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తాం. 2028 నాటికి రాజధాని అమరావతి మొదటి దశ పూర్తి చేసి దానిని కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభిస్తాం.



# అంతా 'డౌట్' సోర్సింగ్..!

- ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగులే కాదు... ఏజెన్సీలూ నకిలీవే
- ఏజెన్సీలపై ఆడిట్ చేయాలని నిర్ణయం
- ప్రత్యేకంగా రాష్ట్రస్థాయిలో కమిటీ ఏర్పాటు
- విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి.
- ప్రాథమిక పరిశీలనలో 40 వేల మంది నకిలీల గుర్తింపు
- ఇందులో 24 వేల మంది ఉద్యోగుల జాడే లేదు
- రికార్డుల్లో ఉన్నా ఎక్కడ పనిచేస్తున్నారో స్పష్టత కరువు
- రెండేసి చోట్ల వేతనాలు పొందుతున్న 5,000 మంది
- లోతుగా విచారణ చేస్తున్న ఆర్థిక శాఖ
- నేరుగా చెల్లింపులు చేసే అంశంపై అధ్యయనం




హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో పెద్ద ఎత్తున నకిలీలు వెలుగులోకి వస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 4.8లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నట్లు ఆర్థిక శాఖ గణాంకాలు చెబుతుండగా ఇందులో దాదాపు 10 శాతం ఉద్యోగులు నకిలీలే ఉన్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన చెల్లింపులు, వారికి అందించాల్సిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ తదితర బెనిఫిట్ల విషయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్న తీరుపై వరుస కథనాలు ప్రచురించబడ్డాయి.దీంతో స్పందించిన ప్రభుత్వం ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయిలో కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆర్థిక శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల తీగలాగుతోంది. ఇప్పటికే సేకరించిన సమాచారం మేరకు విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. దీంతో ఆర్థిక శాఖ మరింత లోతుగా విచారణ చేస్తోంది. ఈ ఏజెన్సీలు ఎవరివి? ఎప్పుడు ఇవి ప్రారంభం అయ్యాయి? వీటి వెనకున్న వారెవరు? అన్న కోణంలో దర్యాప్తు చేస్తోంది.

లి జాడలేని వారెందరో..!

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కేవలం కార్యాలయాల్లోనే కాకుండా క్షేత్ర స్థాయిలోనూ పెద్ద సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే వారి సంఖ్యకు సమానంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వీరంతా ఎక్కడెక్కడ ఏయే పోస్టుల్లో ఉన్నారనేది తేల్చేందుకు ఆర్థిఖ శాఖ వ్యూహాత్మక పరిశీలన చేపడుతోంది. ఉద్యోగుల అధార్, పాన్ వివరాలను కూడా పరిశీలిస్తోంది. ఈ క్రమంలో దాదాపు 5వేల మంది ఉద్యోగులు రెండేసి చోట్ల వేతనాలు పొందుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వేతన చెల్లింపులు ప్రభుత్వం నేరుగా చేయకపోవడం, ప్రభుత్వ శాఖలు ఏజెన్సీలకు గంపగుత్తగా నిధులు ఇస్తుండగా... వాటిని వేరువేరు పద్ధతుల్లో చెల్లింపులు చేస్తుండడంతో ఇలాంటి అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తేల్చారు.మరోవైపు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వారిలో 24వేల మంది ఉద్యోగుల జాడ లేదు. రికార్డులో ఉన్నప్పటికీ వారు ఎక్కడ పనిచేస్తున్నారో స్పష్టత లేదు. అదేవిధంగా మరికొందరు దీర్ఘకాల గైర్హాజరుతో ఉన్నట్లు గుర్తించారు. వారికి సంబంధించి ప్రభుత్వం వేతన నిధులు ఇస్తున్నప్పటికీ వాటిని వెనక్కు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. ఇలా పలు రకాలు నకీలు ఉద్యోగులు ఉన్నట్లు ఆర్థిక శాఖ గుర్తించింది. ప్రస్తుతం ఏజెన్సీల ఆడిట్ ప్రక్రియ కొనసాగుతోంది. విభిన్న రకాలుగా పూర్తిస్థాయి పరిశీలన చేపడితే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

లి బోగస్ ఏజెన్సీలూ ఉన్నాయి..!

తొలుత నకిలీ ఉద్యోగులు ఉంటారని అధికారులు ప్రాథమికంగా అంచనా వేయగా... మరో కొత్త కోణం వెలుగు చూసింది. ఉద్యోగులతో పాటు ఏజెన్సీలు కూడా నకిలీవి ఉన్నట్లు తేలింది. కేవలం ఒక (జ్యోతి కంప్యూటర్ సర్వీసెస్) కంపెనీ ఏకంగా ప్రభుత్వానికి 10వేల మంది ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో అందించినట్లు రికార్డు ఉంది. ప్రస్తుతం ఆడిట్ ప్రక్రియలో భాగంగా సదరు సంస్థకు నోటీసు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిశీచినా ఫలితం లేదు. ఎందుకంటే అలాంటి సంస్థ జాడ దొరకలేదు. ఇది మాజీ ప్రజాప్రతినిధికి చెందినదిగా సమాచారం. ఇలాంటి ఏజెన్సీలు పదుల సంఖ్యలో ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ దిశలోనూ పరిశీలన చేస్తున్నారు.

లి ఇక నేరుగా చెల్లింపులు..!

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన చెల్లింపులను క్రమ పద్ధతిలో చేపట్టాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. గంపగుత్తగా నిధులు ఇచ్చే బదులు డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రన్స్‌ఫర్) పద్ధతిలో చెల్లిస్తే ప్రభుత్వానికి లాభం చేకూరడంతో పాటు ఉద్యోగులకు సకాలంలో చెల్లింపులు జరుగుతాయని, దీంతో అవకతవకలకు తావుఉండదనే అభిప్రాయంతో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కళ్యాణలక్ష్మి సాయం ఇస్తున్న తరహాలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా నేరుగా చెల్లింపులు చేసే అంశంపై అధ్యయనం చేస్తున్నారు.ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులే కాకుండా ప్రభుత్వానికి అనుబంధంగా స్వయం ప్రతిపత్తి సంస్థల్లోని ఉద్యోగులకు కూడా ఆర్థిక శాఖ నుంచే నేరుగా చెల్లింపుల చేయాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంపగుత్త చెల్లింపులు ఉండొద్దని నిర్ణయించిన ఆర్థిక శాఖ...సరళీకరణ పద్ధతిలో చెల్లింపులకు వ్యూహాన్ని తయారు చేస్తోంది ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ఆడిట్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెలాఖరు కల్లా ఆడిట్ ప్రక్రియ పూర్తి కానుందని తెలుస్తోంది. అనంతరం కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలకు అవకాశం ఉంటుంది.

## కర్ణాటకలో 7 వేల మంది విద్యార్థులకు ఎయిడ్స్ వ్యవహారంలో బిగ్ ట్విస్ట్..?

కర్ణాటకలో 7 వేల మంది విద్యార్థులు హెచ్ఐవీ బారిన పడ్డారనే సోషల్ మీడియా ప్రచారాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. విద్యార్థుల వారీగా హెచ్ఐవీ గణాంకాలు తమ వద్ద లేవని తెలిపింది. అదే సమయంలో.. కాలేజీల్లో హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి చేశారన్న వార్త కూడా అవాస్తవమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రతి ఏడాది 11, 12 వేల కొత్త కేసులు నమోదవుతున్నాయని.. అయితే పరీక్షలు పూర్తిగా స్వచ్ఛందమేనని అధికారులు తెలిపారు.దేశవ్యాప్తంగా సంచలనం రేపిన హెచ్ఐవీ కేసుల విషయంలో కర్ణాటక స్టేట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ (కేఎస్ఏపీఎస్) కీలక ప్రకటన చేసింది. కర్ణాటకలో 7 వేల మంది విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్ సోకిందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారం అంతా అబద్ధమని తేల్చేసింది. కర్ణాటకలో హెచ్ఐవీ కేసులు పెరిగాయని, అందుకే కాలేజీల్లో హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి చేశారనే ప్రచారాన్ని పూర్తిగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అసత్యమని.. ఇవి ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని స్పష్టం చేసింది.విద్యార్థులు, గృహిణులు లేదా ఇతర వర్గాల వారీగా హెచ్ఐవీ బాధితుల వివరాలను నిర్వహించదని కేఎస్ఏపీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ బసవంతప్ప తెలిపారు. అందువల్ల 7 వేల మంది విద్యార్థులకు హెచ్ఐవీ సోకింది అనే ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని వెల్లడించారు. 2004 నుంచి 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారిలో మొత్తం సుమారు 39 వేల హెచ్ఐవీ పాజిటివ్ కేసులు మాత్రమే నమోదు అయ్యాయని తెలిపారు. ఈ గణాంకాలను వక్రీకరించి విద్యార్థులకు మాత్రమే సంబంధించినట్లుగా ప్రచారం చేయడం పూర్తిగా తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. అలాగే కర్ణాటకలోని కాలేజీల్లో ప్రభుత్వం హెచ్ఐవీ పరీక్షలను తప్పనిసరి చేసిందనే వార్తలను కూడా అధికారులు ఖండించారు. హెచ్ఐవీ అండ్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యాక్ట్ 2017 ప్రకారం ఒక వ్యక్తి సమ్మతి లేకుండా వారికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాలేజీలు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, పోలీస్ శాఖ, వైద్య విద్యా సంస్థల్లో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాలు మాత్రమే నిర్వహిస్తున్నామని తేల్చి చెప్పారు.




కర్ణాటకలో సుమారు 56 వేల మందికి తమకు హెచ్ఐవీ ఉందనే విషయం తెలియకపోవచ్చని అంచనా వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు.. ప్రతి ఏడాది రాష్ట్రంలో 11 వేల నుంచి 12 వేల కొత్త హెచ్ఐవీ కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. అందుకే ప్రజల్లో అవగాహన పెంచడం, స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని సూచించారు.హెచ్ఐవీ ప్రమాదాన్ని స్వయంగా అంచనా వేసుకునేందుకు 'దీతీమ్ఘని ఖీతీవవ' మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ యాప్‌లో వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేకుండానే హెచ్ఐవీ వచ్చే రిస్క్ అంచనా వేసుకోవచ్చని పేర్కొన్నారు. అవసరమైతే సమీపంలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ)లో స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు అధికారులు హితవు పలికారు.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 23 వేల మంది ఫ్రీగా చికిత్స పొందుతున్నారని.. వారిలో దాదాపు 96 శాతం మందిలో వైరల్ సప్రెషన్ సాధ్యమైందని అధికారులు వెల్లడించారు. దీని వల్ల ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. తప్పుడు ప్రచారాల వల్ల తల్లిదండ్రులు, ప్రజల్లో అనవసర భయాందోళనలు నెలకొంటున్నాయని అధికారులు పేర్కొన్నారు. హెచ్ఐవీకి సంబంధించిన సమాచారం షేర్ చేసే ముందు కేఎస్ఏపీఎస్ లేదా ఎన్ఏసీఓ వంటి అధికారిక సంస్థల నుంచి ధృవీకరించుకోవాలని సూచించారు. అసత్య సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.